


ఆ రోజు రాత్రి ఒంటిగంటకు వీధి తలుపు దబదబ కొట్టిన చప్పుడయింది.

రాజారావు దిగ్గున లేచాడు. పక్క దిగాడు. పక్కనే వున్న మీనాక్షి కూడా మేలుకుంది.

రాజారావు లైటువేసి వీధి తలుపు తీసాడు. ఎదురుగుండా కనిపించిన ఆకారాన్ని చూసి, 'హా, మీనాక్షీ' అంటూ అరిచి వెనక్కి పడిపోయాడు.

మీనాక్షి కంగారుగా పక్క దిగింది. పరుగెట్టుకుంటూ గుమ్మం దగ్గరకొచ్చింది. రాజారావు వెల్లకిలాపడి మూర్ఛపోయి వున్నాడు. గుమ్మం బయట ఓ ఆకారం నిలబడివుంది.

''ఎవరయ్యా నువ్వు ?'' అడిగింది మీనాక్షి ధైర్యంగా.

''నేను ... నేను క్షేమారావుని – ముందు పాపం వాడి సంగతి చూడండి'' అన్నది ఆకారం.

''మా వారిని పట్టుకుని వాడూ గీడు అంటున్నావ్ – మీ ఇద్దరూ స్నేహితులా ?'' అడిగింది మీనాక్షి.

''అయ్యో ! మేవిద్దరం ప్రాణ స్నేహితుల మండీ బాబూ ! నన్ను గుర్తు పట్టలేదా, నేను మీ పెళ్లికి వచ్చాను గూడా'' అన్నది ఆకారం నొచ్చుకుంటూ.

''గుర్తు రావటం లేదే ...'' మీనాక్షి ఆకారాన్ని చూస్తూ పెళ్ళిరోజు ఆలోచిస్తోంది.

''పాపం, ముందు వాడి సంగతి చూడండి– తర్వాత ఆలోచించుదురుగాని'' అన్నది ఆకారం విసుగ్గా.

''ఏం ఫర్వాలేదు. మరో అయిదు నిముషాల కల్లా లేచి కూర్చుంటారు. ఇది ఆయనకు మామూలే ! ... వుండండి ... ఆ రోజు మా పెళ్ళిలో మిమ్మల్ని ఎక్కడ చూసానో గుర్తుకు తెచ్చుకుంటున్నాను – ఆ ! ఇప్పుడు గుర్తుకొచ్చింది – మమ్మల్ని ఫోటో తీయబోతూ మీరు పడ్డారు కింద ! ...''

''అవును నేనే !'' అన్నది ఆకారం.

ఇంతలో రాజారావు లేచాడు. బయట నిలబడ్డ ఆకారం లోపలికొచ్చింది. రాజారావు మళ్ళీ మూర్ఛపోబోయాడు. మీనాక్షి కోపంగా చూడగానే ఆగిపోయి, లేచి నిలబడ్డాడు.

కళ్ళు బాగా నులుముకుని ''నువ్వు ... నువ్వు ...'' తర్వాత మాట్లాడలేకపోయాడు రాజారావు.

''నేను క్షేమారావుని'' అన్నది ఆకారం.

''అదెట్లా సాధ్యం ? నువ్వు బస్సు ప్రమాదంలో పోయావుగా ?''అడిగాడురాజారావు.

''అది నిజమేరా, కానీ పోతే మాత్రం తిరిగి రాకూడదా ఏమిటి ?'' అన్నది ఆకారం.

''నీతో వాదించటం కష్టంగా నీ, లోపలికి రా !'' అన్నాడు రాజారావు.

క్షేమారావు లోపలికొచ్చాడు.

ఇద్దరూ కుర్చీల్లో కూర్చున్నారు.

''అన్నయ్యగారూ, ఏం తాగుతారు ? కాఫీ, టీ, బోర్నవిటా, హార్లిక్స్, కూల్‌డ్రింక్స్...'' అడిగింది మీనాక్షి.

''ఏమీ వద్దమ్మా, కాసేపు మీ వాడితో మాట్లాడి వెళ్లిపోతాను. కావలిస్తే మీరూ కూర్చోండి'' అన్నాడు క్షేమారావు.

''ఇక చెప్పు ? బస్సు ప్రమాదంలో పోయిన వాడివి మళ్లా ఎట్లా తిరిగొచ్చావూ?'' అడిగాడు రాజారావు.

''ఆ రోజు ఏమయిందంటే,... బస్సు స్పీడుగా వెళుతోంది. కండక్టర్‌కి పది రూపాయల నోటిచ్చి టికట్ ఇవ్వమన్నాను. చిల్లర ఇవ్వండి అన్నాడు. చిల్లరలేదు అన్నాను. అయితే టికట్టు లేదు, దిగండి అన్నాడు. నేను దిగనన్నాను. అతను గట్టిగా అరిచాడు. నేనూ గట్టిగా అరిచాను. అతనూ ఇంకా గట్టిగా అరిచాడు. నేను ఇంకా గట్టిగా అరిచాను. అతను ఇంకా ఇంకా గట్టిగా అరిస్తే, నేను ఇంకా ఇంకా గట్టిగా అరిచాను మా గోలకి బస్సులో అంతా చెవులు మూసుకున్నారు. డ్రయివరుకూడా రెండు చేతుల్తో చెవులు గట్టిగా మూసుకున్నాడు, రెండు నిముషాలదాకా – స్టీరింగ్ వదిలేసి. తర్వాత ఏమయిందో నాకు తెలీదు. బస్సు ప్రమాదంలో ముగ్గురి మరణం అని పేపర్లో వార్త చదివాను'' అన్నాడు.

''పేపర్లో చదివావా?చచ్చిన తర్వాత పేపరు ఎక్కడ చదివావు ?''

''ఇక్కడ్నించి తిన్నగా యమలోకం వెళ్లాను కదా. అక్కడికి అన్ని పేపర్లు తెప్పిస్తుంటారు. స్వర్గంలోకూడా తెప్పిస్తారట.''

''అదీ సంగతి ! నువ్వు స్వర్గంలో వున్నావా, నరరంలో వున్నావా ?

"స్వర్గంలోనే" గర్వంగా అన్నాడు క్షేమారావు.

"అదెట్లా సాధ్యం? రాత్రి పూట బోళ్లని దోమల్ని చంపేవాడివి. చీమల మందు తీసుకెళ్ళి గడులనిండా చల్లేవాడివి. ఎందరికో ఆశ చూపించి మోసం చేసి డబ్బు సంపాదించే వాడివి. ప్రతి వాడితో వాదించి చివరకు తన్నులాటలతో, దొమ్మీ కేసులతో తీరిక లేకుండా తిరుగుతుండేవాడివి. తాగుడు అలవాటు కూడా వుందిగా. ఓసారి తాగే గ్లాసుతో ఒకడి ముక్కు మీద గుద్దావు కూడా. మీ బంధువులందరికీ పోరంబోకు స్థలాల పట్టాలు ఇప్పించావు కూడా... ఇవన్నీ పాపాలే కదా. ఇంత చరిత్ర పెట్టుకుని స్వర్గానికెలా వెళ్లావు?" అడిగాడు రాజారావు.

"నరకంలో వుంచితే నేనూరుకుంటా నేమిటి? డబాయించి స్వర్గానికెళ్లాను!" క్షేమారావు మీసం తిప్పాడు.

"అదెలా?"

"మొదట తీసుకెళ్లటం నరకానికే తీసుకెళ్ళారు. నాతోపాటు చాలామంది వున్నారు— వివిధ రాష్ట్రాలు, వివిధ దేశాలనుంచి వచ్చారు. అసలక్కడ నిలబడ్డానికి కూడా చోటు లేదు. ప్రతివాడి కేసు యమధర్మరాజు విని శిక్షలు వేసేదాకా, అక్కడ పడిగాపులు పడాల్సిందే. ఇంకా చూడాల్సిన కేసులు లక్షలమీద వున్నాయి. శిక్షలు పడ్డవాళ్లకే అక్కడ గదులు ఇస్తారు. మరి వాళ్ళు శిక్షలు అనుభవించటానికి చోటు కావాలి కదా. మిగతా వాళ్లని పెద్ద మైదానంలో పడేస్తారు. అక్కడ విపరీతమైన చలి. విపరీతమైన ఎండ. విపరీతమైన వర్షం, పైగా విపరీతమైన ఆకలి. నరకమంటే అదేనన్నమాట. ఇక్కడ సుఖంగా బ్రతికినవాడ్ని కదా, అక్కడి వాతావరణం నాకేమాత్రం నచ్చలేదు. ముందు అక్కడ ఆఫీసులు పనిచేసే విధానం తెలుసుకున్నాను. చిత్రగుప్తుడు అక్కడ పెద్ద అధికారి. అతను ఎంత చెప్తే అంత. చాలా న్యాయంగా వుంటాడట. అతనికి విసుగెత్తి 'నేను పదవీ విరమణ చేస్తాను, ఇప్పటికి యాభై ఎనిమిది కోట్ల కోట్ల సంవత్సరాలు చేసాను— ఇక నేను చేయలేను, మరొకర్ని చూసుకోండి' అని. యమధర్మరాజు వాపోయాడట. అందుకు యముడు నవ్వి, 'ఈ విశ్వంలో మనిద్దరి ఉద్యోగాలే పదవీ విరమణ చెయ్యటానికి వీలులేనివి' అన్నాడట. ఇప్పటికీ పాపం చిత్రగుప్తుడు ఆ రూలూ ఈ రూలు కోసం వెదుకుతూనే వున్నాడట— పదవీ విరమణ కోసం.

సరే, ఎక్కువ పాపాలు చేసిన వాళ్లని శిక్షగా అక్కడ ఆఫీసుల్లో పని చేయమంటారట. జీతం తక్కువ. లంచాలుండవు. అబ్బ! అది, ప్రత్యక్ష నరకం అనుకో... అక్కడ కాసేపు తిరిగిన తర్వాత ఓ గదిలో వార్తా పత్రికలు కనపడ్డాయి. మన పత్రికల్లో నా ఫొటో వేసి వుంది. క్షేమారావు ఫలానా తారీకున స్వర్గస్థులయ్యారు అని రాసివుంది. వెంటనే నాకో ఆలోచన వచ్చింది. గబగబా ఆ పేపర్లు తీసుకుని అక్కడే వున్న ఓ గుమస్తా దగ్గరి కెళ్లాను.

"ఏమయ్యా, నేనిక్కడికి ఎట్లా వచ్చాను?" అని డబాయించాను. అది నరకం కదా, అక్కడ పని చేసే వాళ్లందరూ, బయటవాడెవరైనా సరే వాడికి భయపడాల్సిందే.

ఆ గుమస్తా వణికిపోతూ "అయ్యా, తమరు బస్సు ప్రమాదంలో వచ్చారు" అన్నాడు.

"ఆ బస్సు ప్రమాదంలో ఎంతమంది ఇక్కడికి వచ్చాం?" మళ్లీ దబాయించాను.

"ముప్పయి మంది వచ్చారు" అన్నాడు.

"అవునా! మరి పేపర్లో "ముగ్గురు మరణం..."అని రాస్తుంది?" మళ్లీ దబాయించాను. దబాయించటం మొదలెడితే అదే పనిగా దబాయిస్తూ వుండాలి.

"నిజమే! పేపర్లో ముగ్గురికి మరణం వుంది. దాని తాలుకు ఇక్కడికి వచ్చిన వారి సంఖ్య ముప్పయి. అదే 'టాలీ' కాక చస్తున్నాం. అన్నీ ఇట్లాంటి కేసులే. ఇక్కడేమో పేపర్లో వార్తలు చదివి గదులు కడతారు. వచ్చిన వాళ్లకు సరిపోవు... ఛస్తున్నాం అనుకోండి" అన్నాడు గుమస్తా.

"ఈ పరిస్థితుల్లో మీరేం చేస్తారు?" అడిగాను దబాయించి.

"ముందు మేం పేపర్లో వచ్చిన వార్తల్నే పరిగణలోకి తీసుకుంటాం. అంటే ముందు వచ్చిన ముగ్గురు కేసులు విచారణకు పంపుతాం. మిగతా ఇరవై ఏడుమందిని అట్లా వదిలివేస్తాం, అంకెలు టాలీ అయ్యేదాకా."

"ముందు వచ్చిన ముగ్గురిలో నా పేరు వుందో లేదో చూడు" అడిగాను దబాయించి.

అతను ఓ చిట్టా చూసి "మీది ముప్పయ్యో నెంబరు" అన్నాడు.

"వూ! జాగ్రత్తగా పని చేసుకో" అని దబాయించి బయట కొచ్చేసాను. వెంటనే యముడికి ఒక పిటీషన్ పడేశాను ఇట్లా.

1) పేపర్లో వచ్చిన వార్త ప్రకారం, బస్సు ప్రమాదంలో మరణించిన వారు ముగ్గురే. ఆ ముగ్గురిలో నా పేరు లేదు.

2) పేపర్లో వచ్చిన ప్రకటన ప్రకారం నేను స్వర్గస్తుడనయ్యాను. నరకస్తుడను కాను.

"ఈ పై రెండు కారణాలవల్ల నేను యమలోకానికి తీసుకురాబడటం, నిర్బంధించబడటం అనుచితం. కాబట్టి ఎటువంటి కాలయాపన లేకుండా, వెంటనే నన్ను స్వర్గానికి పంపవలసిందిగా దబాయిస్తున్నాను."

యముడూ, చిత్రగుప్తుడూ నా పిటీషన్ చూసి నానా గొడవ పడ్డారట. ఇంతకాలం నోర్మూసుకు వున్నవాళ్లే తప్ప, ఇట్లా కాగితం పెట్టి గొడవ చేసేవాళ్ళు ఎవరూ లేరట.

"వీడ్ని ఇక్కడుంచితే అందరూ దబాయించటం నేర్చుకుంటారు. ఎందుకొచ్చిన పీడ, వీడ్ని ఇక్కడ్నించి పంపించేయ్" అని యముడు చిత్రగుప్తుడ్ని ఆజ్ఞాపించాడు! అంతే, వెళ్లి స్వర్గంలో పడ్డాను.

ఇక అక్కడ ఎంత బ్రహ్మాండంగా వుందను కున్నావు? అడిగేవాడు చెప్పేవాడు అంతకన్నా లేడు. ఇష్టారాజ్యం. ఏది కావలిస్తే అది దొరుకుతుంది. తినటానికి, తాగటానికి, పడుకోటానికి, సమస్తం... పట్టుపరుపు కావాలనుకో, పట్టు పరుపే. అక్కడ పంపుల్లో వచ్చేది ఏవిటో తెలుసా, అమృతం! ఎంత కావలస్తే అంత తాగొచ్చు పంపులు ఇరవైనాల్గంటలూ వస్తూనే వుంటాయి— ఇక్కళ్లా కాదు. అందునే అక్కడికి వెళ్ళిన వాళ్ళు మళ్లా తిరిగిరారు.

"నాకో విషయం తెలిసింది!" అంది మీనాక్షి చప్పట్లు చరుస్తూ.

"ఏమిటదీ?" ఆశ్చర్యంగా అడిగాడు రాజారావు.

"అందుకే చచ్చిన వాళ్ళు భూమ్మీదకు రారు. నరకానికి వెళ్లారనుకోండి, వాళ్లకు రావటానికి తీరికే వుండదు. పైగా రానివ్వరు కూడా. ఇక స్వర్గానికెళ్లారనుకోండి, ఇక అక్కడి కెళితే తిరిగి రాబుద్ధి వేస్తుందా?"

"అయితే మరి నువ్వు ఎందుకు వచ్చావురా?" రాజారావు అడిగాడు.

"అక్కడ పరమ బోరుకొట్టింది. వాదించుకోవటానికి తన్నుకోవటానికి ఎవరూ లేరు. అవి లేకపోతే సరదా ఏం వుంటుంది, చెప్పు? అయినా ఒక్కసారి ఇక్కడి కొచ్చి పోదామనిపించి వచ్చాను. సరేగానీ, అన్నీ నా సంగతులే చెప్పాను — ఇక నీ సంగతులు చెప్పు!" అన్నాడు చుట్టూ పరీక్షగా చూస్తూ.

"మాకేమోయ్, హాయిగా వున్నాం" అన్నాడు రాజారావు.

"అవును, ఇప్పుడు కిలో బియ్యం రేటు ఎంత? అయిదా, ఆరా?" అడిగాడు క్షేమారావు.

"నువ్వు ఏ లోకంలో వుండి మాట్లాడుతున్నావు? కిలో బియ్యం ఇరవై అయిదు పైసలు మాత్రమే" అన్నాడు రాజారావు.

"అదేవిటీ!! అట్లా ధర పడిపోయిందేమిటి!!" చాలా బాగా ఆశ్చర్యపోయాడు క్షేమారావు.

"అంతే, పంటలే పంటలు మరి. ఎరువులు లేకుండానే పండుతున్నాయి" అన్నాడు రాజారావు.

"ప్రజల్లో బాగా చైతన్యం వచ్చింది. రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. అంతటా పవిత్రత! ఇక కరువు కాటకాలు ఎలా వస్తాయి? అన్యాయం, అక్రమం, ఆందోళన, ద్రోహం, కుట్ర ఇట్లా కొన్ని మాటలు నిఘంటువుల్లోంచి తీసేసారు — ఓ ఆర్డినెన్సు పెట్టి ..." రొప్పుతూ చెప్పాడు రాజారావు.

"అట్లాగా !" క్షేమారావు ఇందాకట కంటే మరింత ఎక్కువగా ఆశ్చర్యపోయాడు.

"అంతేనా, ప్రతి ఇంటికీ, ఓ కారూ, ఫోనూ, టీవీ, ఫ్రిజ్జూ. ఇవన్నీ పక్క గదిలో వున్నాయిలే! ఇట్లా ... ప్రజల కోసం ఎన్నో పథకాలు, మరెన్నో సదుపాయాలు ..." రాజారావు సాగదీస్తు చెప్పాడు.

"పదవీ విరమణ వయసు పెంచారా, ఇంకా తగ్గించారా ?" క్షేమారావు కుతూహలంగా అడిగాడు.

"ఆరోగ్య పథకాలు ఎక్కువవటం వల్ల అందరి శక్తీ, ఆయుష్షు పెరిగింది. అందుచేత 55 నుంచి డెబ్బయికి పెంచారు. ఉద్యోగంలో వున్నప్పటికన్నా రిటైరయితేనే ఎన్నో సదుపాయాలు, సుఖాలు—ఎక్కువమంది అందుకే అరవై ఏళ్లకే రిటైర్‌మెంటుకు పిటీషన్లు పెట్టుకుంటున్నారు.

"ఆరోగ్య పథకాలు అంటున్నావు, అవేమిటీ ?" క్షేమారావు ఆసక్తిగా అడిగాడు.

"వీధికో ఆస్పత్రి కట్టారు. నీకు కాస్త తలనెప్పిగా వుందని తెలిస్తే చాలు. సెకన్లలో అంబులెన్సు వచ్చి ఇంటి ముందు ఆగుతుంది. నెలరోజులు ఆస్పత్రి స్పెషల్ వార్డులో పడేస్తారు. అన్నీ స్పెషల్ వార్డులే నమ్మకో. అన్ని పరీక్షలు చేసి, బాగా తిండి పెట్టి తర్వాత పంపిస్తారు, ఇంటికి" రాజారావు ఆగాడు.

"అబ్బ! ఎంత మారిపోయిందీ రాజ్యం. వూరు బాగా పెద్దదయిందా, రోడ్లు బాగు పడ్డాయా, మురుగు వాసనా, దోమలూ లేవు కదా ?" క్షేమారావు అడిగాడు.

"నువ్వు వూరంతా చూసుకుంటూ రాలేదా ?" రాజారావు సందేహంగా అడిగాడు.

"అబ్బే! దిగటం, దిగటం, స్వర్గం నుంచి మీ గుమ్మం దగ్గరే దిగానంతే" అన్నాడు క్షేమారావు.

"అట్లాచెప్పు. వూరు పూర్తిగా మారి పోయింది. రోడ్లు నున్నగా, అద్దాల్లా వున్నాయి. చాలామంది రోడ్డు మీదే తల వంచుకుని ప్రతిబింబం చూసుకుంటూ, మొహాలు తుడుచు కుంటుంటారు. పౌడర్లు రాసుకుంటుంటారు. తలలు దువ్వుకుంటుంటారు ... ప్రతిఒక్కరికి మంచి ఇళ్లు కట్టి ఇచ్చారు — ఇక మురికివాడలు అంటూ లేవు" అన్నాడు రాజారావు.

కొద్దికొద్దిగా తెల్లవారుతోంది.

క్షేమారావు సందేహమొచ్చి, ఎదురుగా వున్న కిటికీలోంచి బయటకు చూసాడు. మళ్లీ వెనక్కి తిరిగి "బయట కొన్ని పాకలు, మురిక్కాలవలు కనపడుతున్నాయి కదా ? " అడిగాడు.

"ఓ అదా! పూర్వం ఇట్లా వుండేది అని తెలియజేయటం కోసం, కొన్ని ప్రాంతాల్ని అట్లాగే వదిలేసారు. అవి పురాతన వస్తువుల

# 1994

క్రింద లెక్క. వాటిని అట్లాగే సంరక్షిస్తున్నారు" అన్నాడు రాజారావు.

క్షేమారావు సందేహం తీరింది. "ఇక ఏమేమి మార్పులొచ్చాయి ? అన్నట్లు కాలేజీల్లో సీట్లు దొరుకుతున్నాయా ?" అడిగాడు క్షేమారావు.

"సీట్లు దొరకటమేమిటీ ? ఓ వీధిలో పది మంది విద్యార్థులుంటే చాలు, ఆ వీధిలో వాళ్లకి కావలసిన కాలేజీనో, స్కూలో గంటలో పెడతారు."

"మరి పన్నుల విధానం ? "

"ఎవరికీ బాధలేని అతి స్వల్పమైన పన్నులు. ప్రతి ఏటా ఎవరు ఎక్కువ పన్నులు కడితే, వాళ్లకి పెద్ద పెద్ద బిరుదులు ఇస్తారు కూడా.

మీనాక్షి అప్పటికి నాలుగుసార్లు ఆవలించింది.

"ఈ పన్నుల్తో ప్రభుత్వానికి రాబడి సరిపోతుందా మరి ?" సందేహంగా అడిగాడు క్షేమారావు.

"ఎందుకు సరిపోదు ? ప్రతి జిల్లాలోనూ త్రవ్వకాలు మొదలెట్టారు. ఒకచోట బంగారపు గని పడితే, ఒక చోట పెట్రోలు, మరో చోట రాగి — ఇక రాబడికేం తక్కువ ?" రాజారావు ఉత్సాహంగా అన్నాడు

మీనాక్షి నిద్రలోకి జారుకుంది.

"అయితే దొంగతనాలు, దారిదోపిడీలు — ఇవన్నీ మామూలుగా జరుగుతున్నాయా ?" క్షేమారావు అడిగాడు.

రాజారావు నవ్వి "దొంగతనాలా ! అందరికీ అన్ని సదుపాయాలు వుంటే, ఇక దొంగతనాలెట్లా జరుగుతాయి? పైగా కొత్తగా కడుతున్న ఇళ్ళకు ఎవరూ తలుపులు పెట్టించటం లేదు కూడా ?"

"అదేం, తలుపులు ధరలు మరీ అంత బాగా పెరిగాయా ?" క్షేమారావు అడిగాడు.

"అది కాదోయ్ ! దొంగతనాలు జరుగుతాయనేగా తలుపులు వేసుకునేది. అవి లేనప్పుడు తలుపులెందుకు ? అందుకే వాటిని తీసేస్తున్నారు" అన్నాడు రాజారావు.

"అబ్బ ! మాకన్న మీరే ఇక్కడ సుఖంగా వున్నట్టున్నారు. అసలు ఇక్కడే వుండిపోదామనిపిస్తుంది !"

"ఎందుకులేరా, అన్నీవున్నా. ఇక్కడ లేనిది ఒకటుంది !" రాజారావు విచారంగా అన్నాడు.

"ఏమిట్రోయ్ అదీ ?" క్షేమారావు సంతోషంగా అడిగాడు.

"అమృతం! దాన్ని తయారు చేయటానికి ఎన్నో పరిశోధనలు చేస్తున్నారు. ఇంకా ఎంత కాలం పడుతుందో తెలీదు. కాబట్టి మేం ఎప్పటికైనా అక్కడికి రావలసిన వాళ్లమే ! ఇక్కడ ఇప్పుడు ఎవరూ పాపాలు చెయ్యనవసరం లేదు గాబట్టి, మేం అంతా స్వర్గానికే తిన్నగా వచ్చేస్తాం. తర్వాత స్వర్గంలో చోటు సరిపోతుందో లేదోకూడా !" ఆగాడు రాజారావు.

క్షేమారావు దిగ్గున లేచాడు. "ఇక నేను వెళతాను. ఇంకా బాగా తెల్లారితే, స్వర్గానికి దారి కనిపించదు. ఈపాటికి ఇక్కడ్నించి చాలా మంది స్వర్గానికి వెళ్ళి వుంటారు. నా చోటు ఏమయిపోతుందో ఏమో — కంగారుగా వుంది. మీరు కూడా తొరగా వచ్చేయండి. ఈ లోపు మీ కోసం చోటుచూసి వుంచుతాను, తర్వాత మీరు ఇబ్బందిపడకుండా. వుంటా, టా... టా...?" అంటూ వెళ్లిపోయాడు క్షేమారావు.

రాజారావు కళ్ళు నలుముకున్నాడు పక్కకి చూసాడు. మీనాక్షి గాఢ నిద్రలో వుంది.

మీనాక్షి ఆవలిస్తూ బద్ధకంగా లేచింది.

"ఏరీ మీ స్నేహితుడు. వెళ్లిపోయారా?" అడిగింది.

"ఆఁ" అన్నాడు రాజారావు.

"అబ్బ! ఏం నిద్ర పట్టిందండీ. ఈ మధ్య కాలంలో ఇంత మంచి నిద్ర రాలేదంటే నమ్మండి. ఇదంతా మీ మాటల మహత్యం. మీ స్నేహితుడి స్వర్గలోకపు మాటలు కన్నా, మీ మాటలకు మత్తు వచ్చేసింది. అయినా పాపం, ఆయనకు అన్నీ అబద్ధాలే చెప్పారేంటండీ. కొన్ని అయినా నిజం చెప్పాల్సింది" అంది నొచ్చుకుంటూ.

"సరేలే, వాడు చెప్పిన మాటల్లో మాత్రం నిజం ఏడ్చిందనుకున్నావా ? వాడి బొంద. వాడు తిన్నగా నరకం నుంచే ఇక్కడికి పారిపోయి వచ్చాడు. ఇక్కడ వున్నప్పుడు వాడు జైల్లోంచి ఓసారి పారిపోయి. మళ్ళీ వెళ్ళి జైల్లోనే కూర్చున్నాడు-- బయటకన్నా, జైలే బాగుందని" అన్నాడు రాజారావు.

'అలాగా!' మీనాక్షి మత్తులోంచితేరుకుంది.

జీవితాన్ని గొప్పగా వూహించుకుంటూ, కలలు కంటూ కబుర్లు చెప్పుకోవటం చిన్నప్పట్నించీ మా ఇద్దరికీ అలవాటే. తెల్లారిపోయింది గానీ, నేను మొహం కడుక్కుని బజారువెళతాను.

సంచీ ఎక్కడుందో వెతికి ఇవ్వు. రాత్రి బయట కిటికీ దగ్గర వందరూపాయల నోటు పెట్టి మర్చిపోయాను. అది తీసుకురా, దానితో పదికిలోల బియ్యం పట్టుకొస్తాను" అంటూ రాజారావు కదిలాడు.

* * *

ఇది రాజారావు కలని వేరే రాయాలా ? అయితే క్షేమారావు అనే పేరు గల స్నేహితుడు లేకపోవటంచేత అతను దిగులు పడదల్చుకోలేదు. ★